క్లుప్తంగా

రమాబాయికి నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి జన్మ దిన వేడుకలను ఉప సర్పంచ్ కొమ్మాట బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గరుగుల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జనగామ స్వామి, వార్డు మెంబర్ తిరుపతి సిద్ధరాంరెడ్డి, బాల్‌సింగ్, రామస్వామి, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపడిపూజ



పూజ చేస్తున్న భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని ఉత్తులూర్ గ్రామంలో మంగళవారం శివపడి పూజను వైభవంగా నిర్వహించారు. స్థానిక శివ స్వామి నవీన్ నివాసంలో నిర్వహించిన ఈ పూజలో భక్తులు చేపట్టిన భజనలు, కీర్తనలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో గురుస్వాములు భాస్కర్, అశోక్, సంగమేశ్వర్ తదితరులున్నారు.

ముగిసిన బంగారమ్మ జాతర



తిమ్మాపూర్‌లో ఎల్లమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో బంగారమ్మ జాతర మహోత్సవం కనుల పండువగా ముగిసింది. జాతర సందర్భంగా చివరిరోజు మంగళవారం ఎల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, సర్పంచ్ అనూషఅశోక్‌గౌడ్, ఉప సర్పంచ్ సంధ్యవెంకట్‌స్వామి పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నిజాంపేట(మెదక్): ఈ నెల 10న ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించే పదో తరగతి టాలెంట్ టెస్ట్ నిర్వహించే కరపత్రాలను పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ ప్రతాప్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ.. త్వరలో జరగబోతున్న వార్షిక పరీక్షలకు సిద్ధం చేసేందుకు ఎస్‌ఎఫ్‌ఐ పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తుందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అనునిత్యం పోరాటాలతో ముందుకు వెళ్తున్న ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు చదువుల్లోనూ ముందుండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల ఇన్‌చార్జ్ దుర్గాప్రసాద్, సహాయ కార్యదర్శి శివర్ధన్, నాయకులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్దశంకరంపేట బీజేపీ కార్యవర్గ సమావేశం

పెద్దశంకరంపేట(మెదక్): పేటలో బుధవారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు కోణం విఠల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం నిర్వహిస్తామని, ఈ సమావేశానికి బూత్ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, వివిధ మోర్చా కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

నియామకం

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండల బీజేపీ కార్యవర్గాన్ని మంగళవారం అందోల్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఉదయ్‌మోహన్ ప్రకటించారు. అల్లాదుర్గం మండల ఉపాధ్యక్షుడిగా కాటం సదానందంగౌడ్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు కడులూరి రాములు, గడిపెద్దాపూర్ గ్రామ అధ్యక్షుడిగా మరవెల్లి సాయిలుగౌడ్, ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకటేశం, ఉపాధ్యక్షుడిగా కుమ్మరి మారుతి, గ్రామ యూత్ అధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షుడిగా చేవెళ్ల మహేశ్, ప్రధాన కార్యదర్శి అంజనేయులు ఎన్నికయ్యారు.

ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి



కౌడిపల్లి(నర్సాపూర్): కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కొల్చారం(నర్సాపూర్): రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందజేస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్చారంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 22 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం గ్రామంలో రూ.20 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. సమావేశంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు తదితరులు ఉన్నారు.

ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే..

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందుకునేందుకు 22 మంది లబ్ధిదారులు రావాల్సి ఉండగా, ఈ కార్యక్రమానికి కేవలం పది మంది మాత్రమే హాజరు కావడం, సమాచారం ఇవ్వలేదా అంటూ తహసీల్దార్ చంద్రశేఖర్‌రావుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ దశలో చెక్కులను అందుకునేందుకురాని లబ్ధిదారుల చెక్కులను నిలిపివేయాలంటూ తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ మంజుల, మేఘమాల, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రంగౌడ్, జిల్లా మైనార్టీ కన్వీనర్ మన్సూర్ అలీ, మెదక్ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ సావిత్రిరెడ్డి, ఎంపీడీఓ గణేశ్ రెడ్డి, సర్పంచ్ ఉమాదేవి, కిష్టాపూర్ సర్పంచ్ గోదావరి, కౌడిపల్లి ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మండలంలోని 35 మందికి నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే రుస్తుంపేటకు రమేశ్‌కు రెండున్నర లక్షల రూపాయల ఎల్ఓసీని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతి, జెడ్పీటీసీ బబియానాయక్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, తహసీల్దార్ ఆంజనేయులుగౌడ్, డిప్యూటీ తహసీల్దార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్, బీఆర్ఎస్ నాయకులు, సర్పంచ్‌లు వెంకటేష్‌గౌడ్, సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగులకు స్థలం కేటాయించాలి

రిటైర్డు ఉద్యోగుల భవన్ నిర్మించేందుకు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి జిల్లా కలెక్టర్ రాజర్షిషాను ఫోన్‌లో కోరారు. కార్యక్రమంలో పలువురు రిటైర్డు ఉద్యోగులు మల్లారెడ్డి, జహీరోద్దీన్ తదితరులు ఎమ్మెల్యేను ఎంపీడీఓ కార్యాలయంలో కోరారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలో 28మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కమలాద్రి, ఆర్ఐ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, ఎంపీపీ రాజునాయక్, జెడ్పీటీసీ కవితఅమర్‌సింగ్, మండల అధ్యక్షుడు రామాగౌడ్, జిల్లా నాయకులు పైడి శ్రీధర్‌గుప్తా, సొసైటీ వైస్ చైర్మన్ చిన్నంరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌లోని రైతువేదిక భవనంలో తహసీల్దార్ ముసాద్దీక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అర్హులైన 37 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అదేవిధంగా గంగారం గ్రామంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వినోద, వైస్ ఎంపీపీ విశ్వంభ ఎంపీడీఓ శశిప్రభ, సొసైటీ చైర్మన్ ధర్మారెడ్డి, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో బంగారు భవిత

వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థుల బంగారు భవితకు విద్య పునాది లాంటిదని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి హితవు పలికారు. మండలంలోని బండపోసాన్‌పల్లి ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు సందడిగా సాగాయి. కార్యక్రమంలో డీఈఓ రమేశ్ కుమార్, జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, సర్పంచ్ నరేందర్ రెడ్డి, నాయకులు అనంతరెడ్డి, నరేందర్ రెడ్డి, జిల్లా కో ఆప్షన్ మన్సూర్, హెచ్ఎం రామ్ కిషన్, ఎస్ఐ మధుసూధన్ గౌడ్, విద్యార్థులు, వారి తల్లిదండురలు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం లేక.. శిబిరాలు వెలవెల



అల్లాదుర్గం(మెదక్): గడిపెద్దాపూర్‌లో కంటి శిబిరం వద్ద కనిపించని జనాలు

అల్లాదుర్గం(మెదక్): కంటి వెలుగు శిబిరాలు వెల్లవెలబోతున్నాయి. సరైన ప్రచారం, సమాచారం లేక మండలంలోని గడిపెద్దాపూర్‌లో మంగళవారం శిబిరానికి ప్రజలెవరు రాలేదు. గ్రామంలో 3,452 మంది పరీక్షలు చేసుకోవాల్సి ఉండగా, 1800 టార్గెట్ పూర్తి చేయాల్సి ఉంది. తొమ్మిది రోజుల్లో కేవలం 800 వరకు మాత్రమే కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు చేసిన వారికి అవసరమైన అద్దాలు లేకపోవడంతో శిబిరాలకు వెళ్లడం లేదని తెలిసింది. ఆరోగ్య సిబ్బంది మొక్కుబడిగా శిబిరాలు నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. కంటి శిబిరంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ఇతర విధుల్లోకి తీసుకోవద్దని ప్రభుత్వం ఆదేశించిన జిల్లా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. గడిపెద్దాపూర్ కంటి వైద్య శిబిరంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సూపర్ వైజర్లు, ఒక ఏఎన్ఎం మంగళవారం జిల్లా వైద్యాధికారి సమావేశానికి వెళ్లారు. దీంతో శిబిరానికి హాజరు కాలేదు.

పెద్దశంకరంపేట(మెదక్): కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పేటలో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, వైద్యసిబ్బందికి పలు సూచనలందించారు. కంటివెలుగులో ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, ఏపీఎం గోపాల్, వైద్యులు రజిని, పీహెచ్‌సీ సిబ్బంది సాయిలు, వెంకటేశం, యాదయ్య, భూమయ్య, శ్రీదేవి తదితరులున్నారు.

బాలాలయంలో హోమం



హోమం చేస్తున్న వేద పండితులు

శివ్వంపేట(నర్సాపూర్): బగలాముఖి బాలాలయంలో మంగళవారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. వేద పండితులు, బగలాముఖి ఉపాసకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో బాలాలయంలో కూష్మాండపవమాన హోమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా, గ్రామ పురోహితుడు పురుషోత్తమశర్మ, చాకరిమెట్ల ఆలయ ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం సందర్శన



పంట వివరాలు తెలుసుకుంటున్న మహిళలు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాలకు చెందిన మహిళా రైతులు మంగళవారం సంగారెడ్డి జిల్లా తునికిలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని సెహగల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో సందర్శించారు. కూరగాయల పంటల గురించి మహిళలకు కృషి విజ్ఞాన కేంద్రం పరిశోధకులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చేగుంట ఇన్‌చార్జ్ సంతోశ్, సీఎస్ఆర్ ప్రాజెక్టు ప్రతినిధులు శరణ్, లారెన్స్, కాసీంవలీ, మహిళా రైతులు ఉన్నారు.

నేడు సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

నర్సాపూర్‌రూరల్: మండలంలోని లింగాపూర్ గ్రామంలో సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని శ్రీరామనారాయణ క్షేత్రం ట్రస్ట్ నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం నుంచి ఆలయం వద్ద ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అతివేగం, అజాగ్రత్తతోనే రోడ్డు ప్రమాదాలు



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

చేగుంట(తూప్రాన్): అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతాయని రోడ్డు భద్రతా అధికారి డీఎస్పీ చంద్రభాను అన్నారు. మండల కేంద్రం చేగుంటలో డ్రైవర్లు, యువకులకు రోడ్డు భద్రత ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. ఆటో డ్రైవర్లు నిబంధనల ప్రకారం ఆటోలు నడపాలని, యువకులు బైకులు నడిపేటప్పుడు హెల్మెంట్ తప్పనిసరిగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో రామాయంపేట సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్, డాక్టర్ మాధవ్‌రావు, ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఇళ్ల స్థలాలు కేటాయించాలి’



నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

రామాయంపేట(మెదక్): మండలంలోని కాట్రియాల గ్రామంలో అర్హులైనవారికి ఇళ్లస్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ గ్రామానికి చెందిన దళితులు తమ పట్టా సర్టిఫికెట్లతో మంగళవారం గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బాలమణి, మల్లేశం ఆధ్వర్యంలో గ్రామంలో లబ్ధిదారులు సమావేశమై మాట్లాడుతూ... తాము ఇంటి వసతి లేకపోవడంతో పూరిగుడిసెల్లో నివాసం ఉంటున్నామని వాపోయారు. 2008లో తమకు ఇంటి స్థలం కేటాయిస్తూ సర్టిఫికెట్లు ఇచ్చినా.. స్థలం చూపలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్థలం కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆహ్వానం**

చిన్నశంకరంపేట(మెదక్): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని రుద్రారం గ్రామంలో వెలసిన శ్రీసంగమేశ్వరస్వామి ఆలయ 74వ వార్షికోత్సవాలకు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని సర్పంచ్ మంచాల లక్ష్మణ్ ఆహ్వానించారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో ఆమెను కలిసి ఆహ్వానపత్రికను అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, ఆలయ కమిటీ సభ్యులు సిద్దిరాములు, భిక్షపతి తదితరులున్నారు.

◆ **బీజేపీ సమావేశాలను విజయవంతం చేయాలి**

పాపన్నపేట(మెదక్): బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్నర్ సమావేశాలను విజయవంతం చేయాలని మెదక్ నియోజకవర్గ కన్వీనర్ ఎక్కల్‌దేవి మధుసూదన్ పిలుపునిచ్చారు. పాపన్నపేటలో మంగళవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ కార్యకర్తలు ఈనెల 11 నుంచి నిర్వహించే కార్నర్ సమావేశాలను విజయవంతం చేసేందుకు పని చేయాలన్నారు. బీజేపీ పథకాలు, ఆశయాలు ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్షేమం గురించి ప్రతీ ఇంటికి వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నారాయణ, శ్రీరాంనరేష్, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శులు, రాజు, భిక్షపతి, బాగేష్, సద్యద్‌గౌస్, నర్సింలు చంద్రయ్య, జగీశ్, లక్ష్మణ్, రాజు, నర్సింలు, అరుణ్, పెంటయ్య, సాయిబాబా, ఎలియా, దుర్గయ్య, శ్రవణ్, యుగందర్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

◆ **పరామర్శ**

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కటుంబాలను దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు మంగళవారం పరామర్శించారు. మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో నీలి వెంకటయ్య, మ్యాకల రాములు ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబీకులను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూపాల్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గణేశ్ రవికుమార్, మాజీ సర్పంచ్ నాగభూషణం, బాలచంద్రం, సంతోష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కర్నపాండు మాసాయిపేట మండల అధ్యక్షుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్లేట్ల పంపిణీ**

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థుల చదువుతో పాటు వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ రాజునాయక్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన కౌడిపల్లిలోని గిరిజన బాలికల మినీగురుకులంలో ప్రభుత్వం విద్యార్థులకు సరఫరా చేసిన ప్లేట్స్, గ్లాస్, కాస్మోటిక్స్‌ను ప్రిన్సిపాల్ స్రవంతి, జెడ్పీటీసీ కవితఅమర్‌సింగ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్రవంతి, మాజీ సర్పంచ్ శివాంజనేయులు, వార్డు సభ్యులు తిరుమలేశ్, నాయకుడు అమర్‌సింగ్, ఉపాధ్యాయులు శోభారాణి, మరోణీ, ప్రమీల, వైష్ణవి, సరోజ, కవిత, లలిత, శైలజ, మాధవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

◆ **మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిపై గ్రామస్తుల ఆగ్రహం**

వెల్దుర్తి(తూప్రాన్): రామాయంపేట మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తన స్వగ్రామమైన మాసాయిపేట మండల కేంద్రంలో గతంలో గ్రామ అవసరాల కోసం ఇచ్చిన నాలుగు ఎకరాల భూమిని వేరే సంస్థకు గిఫ్ట్ డీడ్ చేశారని ఆరోపిస్తూ మాసాయిపేటలో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గ్రామ చావిడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి సదరు భూమిని తిరిగి గ్రామపంచాయతీ పాలకవర్గానికి అప్పగించాలంటూ తహసీల్దార్ మాలతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, సిద్ధిరాములు గౌడ్, ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు యాదగిరి, నర్సింలు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న ఉత్సవాలు



కౌడిపల్లి(నర్సాపూర్): స్వామివారిని దర్శించుకుంటున్న టీపీసీసీ కార్యదర్శి రాజిరెడ్డి



నిజాంపేట(మెదక్): కల్వకుంటలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లితో పాటు కంచన్‌పల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో శ్రీ మల్లికార్జునస్వామి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జాతరలో భాగంగా మంగళవారం ఒగ్గుపూజారులు మల్లన్న స్వామికి నాగవెల్లి నిర్వహించారు. ఆలయంలో వివిధ గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని వెంకట్రావ్‌పేటలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మల్లన్న స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సలీం, రాజు, దొంతుల దుర్గయ్య, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కౌడిపల్లి, కంచన్‌పల్లిలో నిర్వహిస్తున్న మల్లన్న ఉత్సవాల్లో టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు పాషా , యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కల్వకుంటలో మల్లికార్జున స్వామి కల్యాణం

నిజాంపేట(మెదక్): మండలంలోని కల్వకుంట గ్రామంలో రెండో రోజు మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం భక్తులు ఎల్లమ్మను దర్శించుకొని, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ మధుసుదన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాజిరెడ్డి, నర్సింహరెడ్డి, గుర్రం విఠల్, చింతల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

‘మన ఊరు – మనబడి’ పనుల పరిశీలన



తాగునీటి నల్లాలను పరిశీలిస్తున్న అధికారులు

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రం కొల్చారంలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలో మన ఊరు – మనబడి పథకంలో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న పనులను మంగళవారం ఎంఈఓ నీలకంఠం, ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి పరిశీలించారు. పాఠశాల ప్రహరీ, తాగునీటి వసతుల ఏర్పాట్లపై ఆరా తీశారు. నిర్దేశించిన సమయంలోగా పనులను పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు. మండలంలో ఈ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలల్లో మండల కేంద్రం కొల్చారంతో పాటు చిన్నఘనపూర్ పాఠశాలల్లో పనులు పూర్తి కావచ్చాయని, విద్యార్థులకు అవసరమైన ఫర్నిచర్ వచ్చిందని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ మహిపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అంజయ్య ఉన్నారు.

ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏడీఏ వసంత సుగుణ

నిజాంపేట(మెదక్): పీఎం కిసాన్ పథకంలో భాగంగా త్వరలో 13వ విడత నగదు రైతుల ఖాతాల్లో జమకానుందని, దీంతో ప్రతీ రైతు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని రామాయంపేట వ్యవసాయ సంచాలకురాలు వసంత సుగుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికి ఈ కేవైసి చేసుకొని, రైతులు తమ బ్యాంకు ఖాతా ఆధార్ కార్డ్ లింక్ చేసుకోవాలని సూచించారు. రైతులు నాలుగు, ఐదు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసి, పీఎం కిసాన్ 13వ విడత నగదు పొందాలని తెలిపారు. ఇప్పటికి రామాయంపేట డివిజన్(రామాయంపేట, నిజాంపేట, నార్సింగి, చేగుంట)లో మొత్తం 1156 మంది రైతులు బ్యాంకు ఖాతాకి, తమ ఆధార్ కార్డుని లింక్ చేసుకోలేదన్నారు. రైతులు అందరు త్వరగా బ్యాంక్‌కి వెళ్లి వారి ఆధార్‌కార్డ్‌కి బ్యాంక్ ఖాతాకి లింక్ చేసుకోవాలని చెప్పారు. ఈ విషయమై ఆమె మండలంలోని ఏపీజీవీబీకు సందర్శించి, బ్యాంక్ అకౌంట్‌కి ఆధార్ లింక్‌లేని రైతుల జాబితాను తెలుపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్, ఏఈఓలు శ్రీలత, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ కరెంట్‌తో డబ్బు ఆదా



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మనోహరాబాద్(తూప్రాన్): సోలార్ కరెంట్‌తో ఎంతో డబ్బు ఆదా అవుతుందని, సోలార్‌ను అందరూ వినియోగించుకోవాలని రీజినల్ మేనేజర్ గంగారాం, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్ మహిళా సంఘాలను కోరారు. మంగళవారం మండల కేంద్రంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళా సమైఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మాట్లాడుతూ.. ప్రస్తుత జీవనంలో కరెంట్ ఎంతో అవసరమని, కరెంట్ బిల్లులు కట్టాలంటే సమస్యలు ఎదురయ్యే సందర్భాలున్నాయని, అలాంటి సమస్యను పరిష్కరించుకొని, ఆదాయ బాటలో సాగడానికి సోలార్ కరెంట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మండలానికి 35 యూనిట్లు ఉన్నాయని, మహిళా సంఘాల వారికి సబ్సిడీపై అందజేస్తామన్నారు. నిరుపేదలను దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమయ్యే 2కేవీ, 3 కేవీ యూనిట్లను సబ్సిడీపై అందజేస్తామన్నారు. 60 నెలల వాయిదాలో కిస్తీలు కట్టాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ లతావెంకట్‌గౌడ్, ఏపీఎం పెంటాగౌడ్, సీసీలు కృష్ణవేణి, విజయలక్ష్మి, శోభారాణి, వీఓ, వీఏఓలు, మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

కాండం తొలుచు పురుగును నివారించుకోవాలి



నర్సాపూర్‌రూరల్: పొలాలను పరిశీలిస్తున్న ఏఓ అనిల్

కౌడిపల్లి(నర్సాపూర్): వరి పంటలో కాండం తొలుచుపురుగు, అకుమచ్చ తెగులును నివారించుకోవాలని ఏఈఓ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం మండలంలోని ముట్రాజ్‌పల్లిలో యాసంగి సాగుపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించారు. పంటలకు చీడపీడలు ఆశించినట్లయితే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ఆయన అన్నారు. సర్పంచ్ సంజీవ్, వెంకటేశం, రైతులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు సరైన సమయంలో సరైన నివారణ చర్యలు పాటిస్తే పంటలు భద్రంగా ఉంటాయని ఏడీఏ పద్మ అన్నారు. ఆమె మండలంలోని బండపోతుగల్, ఫైజాబాద్ గ్రామాల్లోని వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరి సాగులో మోగి పురుగు (కాండం తొలచు పురుగు), జింక్ లోపం ఉధృతంగా ఉందన్నారు. మోగి పురుగు నివారణకు వరి నాటుకున్న 15 రోజుల లోపు ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు, 8 కిలోలు, లేదా, క్లోరంట్రానిలిప్రోల్ 0.4 గుళికలు, 4 కిలోల చొప్పున వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ భూపాల్, రైతులు సంగాగౌడ్, గోపాల్, విభీషణ్ పాల్గొన్నారు.

నర్సాపూర్‌రూరల్: మండల పరిధిలోని రెడ్డిపల్లి క్లస్టర్‌లో వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి అనిల్ మంగళవారం పరిశీలించారు. కొన్ని పొలాలలో అధిక మురుగునీటితో సల్ఫైడ్‌తో దెబ్బతిన్నట్లు తెలిపారు. దీంతో వేర్లు నల్లబడి కుళ్లిపోయిన కోడిగుడ్ల వాసన వస్తుందన్నారు. ఆ పొలాల్లో మురుగునీటిని కాల్వల ద్వారా బయటకు పంపి, పొలాన్ని ఎండబెట్టాలని చెప్పారు. మరికొన్ని పొలాల్లో ఆకులు ఎండిపోతున్నాయని, దీని నివారణకు 20 కిలోల యూరియాలో 250 గ్రాముల కార్బన్డిజం, మ్యాన్కోజబ్ పొడి మందును కలిపి చల్లాలని, ఈ తెగులు నివారించవచ్చునని చెప్పారు. ఆయన వెంట ఏఈఓ శిరీష, ఏఓ అనిల్ కుమార్, రైతు గొరేశ్ పాల్గొన్నారు.

తూప్రాన్: వరి పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే తెగుళ్ల నుంచి పంటలను రక్షించుకోవచ్చని ఏఈఓ సంతోష్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రైతు వేదికలో వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఈఓ అవగాహన కల్పించారు.

కేన్సర్ నిర్ధారణ శిబిరం



శిబిరంలో మహిళలు, సేవాసమితి సభ్యులు

రామాయంపేట(మెదక్): సత్యసాయి సేవాసమితి వారి ఆధ్వర్యంలో మంగళవారం ఎంఎన్‌జే ఆస్పత్రి వారి సహకారంతో పట్టణంలోని సాయి మందిరంలో కేన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. మొత్తం 150 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవాసమితి జిల్లా కన్వీనర్ యాచం శంకరయ్య , జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర మహిళా ఇన్‌చార్జ్ గీతా పవన్, సభ్యులు బాలకిషన్, భానుశేఖర్, రాజ్‌కుమార్, చంద్రమౌళి, సుధాకర్, భూలక్ష్మి, మంజుల, భారతమ్మ, సేవాదళ కోఆర్డినేటర్ గౌరీశంకర్, మెదక్ సేవా సమితీ కన్వీనర్ వెంకట్‌గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.